# "ప్రతీకారం"

— నెక్కంటి వెంకటేశ్వరరావు

ఇంగ్లండు నుండి ఇండియాకు వచ్చి వారంరోజులైంది. వచ్చిన దగ్గర నుండీ గుడివాడ తాసిల్దారు గారమ్మాయనీ, గుంటూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగారమ్మాయనీ .... ఇంటికొచ్చిన పెళ్ళి సంబంధాల గురించి అమ్మ చెపుతూనే వుంది. నాకు నచ్చిన పిల్ల దొరికితే అలాగే చేసుకుంటాను అందుకు కొంచెం టైం పడుతుందన్నాను

రెండ్రోజుల క్రిందట ఏలూరు నుండి మావయ్య పనిగట్టుకుని విశాఖపట్నం వచ్చి తన ఏకైక పుత్రిక మాలినిదేవిని చేసుకోమని విన్నవించుకున్నాడు. పేరు బాగానే వుంది పిల్లను ఒకసారి చూస్తే పెళ్ళి చూడాలని పించదు. సన్నగా, నల్లగా, పొడుగ్గా రివటలా వుంటుంది. ఇంగ్లండు వెళ్ళేటప్పుడే ఎట్టి పరిస్థితుల్లోనూ యీ పెళ్ళి జరగదని మావయ్యతో ఖచ్చితంగా చెప్పేశాను ఇండియాకు వచ్చిన తర్వాతకూడ అదే మాటన్నాను. కోపంతో దూరపు కొండలు నునుపన్నాడు మీ నాన్న లేకపోవడంతో నీ యిష్టం వచ్చినట్లు సాగుతోం దన్నాడు నాన్న వుంటే సాగదు కాబోలు. ఇంకా బాగా సాగేది రెండు కుటుంబాలు ఏకం కావాలంటే యీ పెళ్ళి చేసుకోమన్నాడు. లాభం లేదని చెప్పడంతో భోజనం అయినా చెయ్యకుండా వెళ్ళిపోయాడు.


భోజనం చేసి మేడమీదకెళ్ళి టేబుల్ దగ్గరిగా కుర్చీ లాక్కొని, కిటికీ లోంచి నిండుగా కనిపించే చందమామను చూస్తూ కూర్చున్నాను విశాఖపట్నంలోని ఇంజనీరింగ్ కాలేజీలో మెకానికల్ బ్రాంచి తీసుకుని, థర్డియర్ చదువుతున్న రోజుల్లో "మమతెరిగిన మానవ హృదయాలు" నవల ఆ తర్వాత ఒకవంద పైగా కథలు రాశాను. వారపత్రికల్లో పడ్డాయి. రచయితయ్యావని అమ్మ అన్నయ్య పుస్తకాలురాసి పేరు సంపాదిస్తావని తమ్ముడు అనేవారు అప్పుడు నా ఆనందానికి అవధులు లేకపోయేవి కథ రాసి చాల కాలమైంది. కథ వ్రాద్దామని పించింది టేబిల్ లైటు వేసుకుని డెస్కులో కాగితం, కలం, తీసుకున్నాను ఏమని వ్రాయను ? థీమ్ దొరుకుతుందేమోనని చలని వెన్నెలలు కురిపించె చందమామ లోకి చూశాను గతం గుర్తుకువచ్చి మనసు వికలమయింది. దేవుడులాంటి నాన్నతో మాట్లాడుతున్నట్లు, నాన్నతో కలసి కార్లో వెళ్ళటం, రావటం .... అస్పష్టంగా చందమామలో సినిమా రీళ్ళలాగ కనిపించాయి. లైటుఆర్పేసి కళ్ళుమూసుకుని పడుకున్నాను.

ఉదయం నిద్ర లేవగానే గుడివాడ తాసిల్దారుగారమ్మాయిని చేసుకుంటే బావుంటుందని, అమ్మ తన అభిప్రాయాన్ని తెలియపర్చింది. మైసూరు వెళ్ళి నాన్నగారి స్నేహితుడు ప్లీడరు రామారావుగారిని కలుసుకుని వచ్చేస్తాను. గుడివాడ మంచి రోజు చూసుకుని తర్వాత వెళ్ళవచ్చన్నాను. అమ్మ నిరుత్సాహంగా మొహం పెట్టి "నీ యిష్టం" అంది.

విశాఖపట్నం నుండి మైసూరు వెళ్ళి, ప్లీడరు రామారావుగారింటి కెళ్ళాను

రాత్రి భోజనాలయిం తర్వాత రామారావుగారు సోఫాలో నా ప్రక్కన కూర్చున్నారు. "మధూ ! మీ నాన్న లేకపోవటం ఒక్కటే తీరనిలోటు మీనాన్న బ్రతికున్న రోజుల్లో, మా పెద్దమ్మాయి పార్వతిని నీ కిచ్చి పెళ్ళి చెయ్యాలనుకునేవాళ్ళం. మరి నీ యిష్టం యెలా వుందో కాని, అమ్మాయి మాత్రం

# ఆరోగ్య నిధి



డా॥ ఎన్. ఆంజనేయులు

## 32. పచ్చకామెర్లు

పచ్చకామెర్లు అంటు వ్యాధని చాలామందికి తెలియకపోవచ్చు. రోగి మల మూత్రాల ద్వారాగాని, లేదా ఆహారం పుచ్చుకునే సామాగ్రి ద్వారాగాని ఈ రోగం ఒకరినుండిమరొకరికి సోకుతుంది.

రక్తంలో తయారయిన "బిలురుబిన్" అనే పదార్థం కాలేయంలోని బైల్‌డక్ట్ ద్వారా ప్రేవుల్లోకి చేరుతుంది. కారణం ఏదయినప్పటికి రక్తంలో బిలురిబిన్ ఎక్కువగా నిలువవుంటే మూత్రం పచ్చబడుతుంది. కళ్లు పచ్చగా కనుపిస్తాయి. దీనినే పచ్చకామెర్లంటారు.

మన ప్రాంతంలో చాలామంది చెట్లు తిరగేయించటం మంత్రాలు పెట్టించటం చేస్తుంటారు. ఈ రోగానికి, అసలు శాస్త్రరీత్యా ఆలోచిస్తే పచికర్లకు సరయిన మందు లేదనే చెప్పాలి డాక్టర్లు సయితం కాలేయపు అణువులు పాడవకుండా వుండటానికి మాత్రమే మందులు వాడుతారు, అయితే ఆహారంలో క్రొవ్వు పదార్థములు తగ్గించి వాడటం మంచిది. జబ్బు త్వరగా తగ్గటానికి దోహద మవుతుంది. అయితే ఒక్కొకసారి "పాంక్రియాస్" అనే భాగంలో గడ్డలు పెరిగినపుడు వచ్చేపచ్చకామెర్లు ప్రమాదకర మయినవి. దీనికి వీలయినంత వెంటనే శస్త్రచికిత్స చేయవలసి వుంటుంది.

పచ్చకామెర్లు మంత్రాలకు తగ్గిపోతాయని భ్రమించక - ఆ తర్వాత లివర్‌కు వచ్చే ప్రమాదాలనుండి తప్పుకోటానికయినా మందులు వాడటం అవసరం. ఏమయినా తొలిదశలో మందులు వాడితే ప్రమాదమేమీ వుండదు.

---

బి. ఎ. చదివింది. చదువు యిక్కడే చదివినా కన్నడం. ఇంగ్లిషుతో పాటు మాతృభాష కూడ మాట్లాడుతుంది." అన్నారు. రెండు నిమిషాల తర్వాత ద్వారం వైపు చూసి "అమ్మాయి పారూ! స్వల్పా నీరు తగొంబన్ని" అనగానే పెద్దమ్మాయి పార్వతి మంచి నీళ్ళు తెచ్చి యిచ్చింది. అమ్మాయిని చూడగానే ఒక చిన్న సైజు ఏనుగు నా మనోఫలకంపై ప్రత్యక్షమయిందేమో ననిపించింది. నా మొహం వంక అదోలా చూసి "నీరు బేకేని" అనగానే నాకూడ తెస్తుందేమోనని, వద్దన్న పదానికి కన్నడం తెలుసు కనుక "బేడా, బేడా!" (వద్దు! వద్దు!) అని మనసులోనే అనుకుని, అతి కష్టంమీద యెలాగైతేనేమి "బేడా!" అని అనగలిగాను. పార్వతి నెమ్మదిగా లోపలికెళ్ళింది. తిండి విషయంలో జాగ్రత్త తీసుకోకుండా, వుంది కదా అని తినేస్తే యిలాగే

అయిపోతారు కాబోలు ననిపించింది. రామారావుగారు ఆంధ్ర నుండి మైసూరు వచ్చిన తర్వాత తన ప్రాక్టీసు యెలా సాగిందీ చెప్పారు. నేను కూడ ఆయన అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ, ఇంగ్లాండు జీవితం గురించి కాస్సేపు మాట్లాడి పడుకున్నాను.

ఉదయం కాఫీ తాగ్గానే నేను వెళ్ళిపోతానని పెళ్ళి విషయం మా అమ్మగారితో మాట్లాడి వెంటనే లెటరు వ్రాస్తానని" చెప్పి మైసూరు నుండి బయలు దేరాను.

మధ్యాహ్నం బెంగుళూరులో బృందావన్ ఎక్స్‌ప్రెస్‌కి సీటు రిజర్వు చేయించుకుని "బి" కంపార్టుమెంటులో టిక్కెట్టు మీదున్న సీటు నెంబరు చూసుకుని కూర్చున్నాను. నా కెదురుగా మూడు సీట్లున్నాయి. ఇద్దరమ్మాయిలు నాదగ్గరకొచ్చి, వాళ్ళ టిక్కెట్ల మీదున్న నెంబర్లుసీట్ మీదున్న నంబరుచూసుకొని, సరిపోయాయనే సంతోషంతో చిరునవ్వు నవ్వుకొని నాకెదురుగా కూర్చున్నారు. వాళ్ళిద్దరి ప్రక్కన మూడో సీట్ ఖాళీగానే వుండి పోయింది. ఇద్దరూ అక్కచెల్లెళ్ళులాగున్నారు. పెద్దమ్మాయికి కొత్తగా పెళ్ళయి వుంటుంది. నిదర్శనంగా నుదుట కుంకుమ రేఖ, మెడలో పచ్చని పసుపు త్రాడు స్పష్టంగా కనిపిస్తూనే వున్నాయి. చిన్నమ్మాయికి అటువంటి నిదర్శనాలేవీ లేవు. కొంచెం పరిశీలనగా చూశాను. కనకాంబరం రంగు చీర, అదేరంగు జాకెట్టు అదేరంగు బొట్టు చెవులకు ముత్యాలద్రాక్షి ఒక చేతికి ఒక తెలుపు రాళ్ళగాజు వేసుకుని మరోచేతికి వాచ్ పెట్టుకొంది. మెడలో వేసుకున్న లాకెట్‌లో రాళ్ళు తెల్లగా మెరుస్తున్నాయి నల్లని వాల్జడలో తెల్లగులాబీలు స్వచ్ఛమైన తెలుపు రంగులో చూడ ముచ్చటగా వున్నాయి. మొత్తం మీద దివినుండి భువికి దిగివచ్చిన పారిజాతంలా వుంది. పేరేమిటో? దేవకన్య అంటే బావుంటుంది.

దేవకన్య వారపత్రిక చదువు కుంటోంది. నేనుకూడ కొత్త మాగజైను తిరిగేయడంలో మునిగి పోయాను. ట్రెయిను కదిలేటయిముకు యిద్దరు పెదమనుషులు నా దగ్గరకు వచ్చి, తమిళంలో గల గలమని యేదో మాట్లాడుకుని నా పక్కన కూర్చున్నారు.

ట్రెయిన్ కాట్పాడి స్టేషన్ దాటిం తర్వాత కాంటిన్‌లో కప్పు కాఫీ తాగి వచ్చి నా సీట్లో కూర్చున్నాను. ట్రెయిన్ వేగంగా పరుగెడుతోంది. ధైర్యంగా దేవకన్య వివరాలు అడుగుదామనుకున్నాను. ఈ పవిత్ర భారత దేశంలో అలా అడగటం సభ్యతకాదని వూరుకున్నాను. దేవకన్యమాట విందామంటే అక్కయ్యతో కూడ మాట్లాడకుండా పత్రికలు చదువుకుంటూ, మధ్య మధ్య కిటికీలోంచి బయటికి చూస్తూనే కాలక్షేపం చేసేసింది. ట్రెయిన్ మద్రాసు ప్లాట్‌ఫారం మీదికి చేరింది. వాళ్ళిద్దరూ ట్రెయిన్ దిగిపోయారు.

టిఫిన్ చేసి మెయిల్ వచ్చేటయిముకు ప్లాట్‌ఫారంమీద నిల్చున్నాను. దేవకన్య కనిపించలేదు. మెయిల్ వచ్చింది. యాంత్రికంగా ఎక్కి కూర్చున్నాను. చీకటిలో ట్రెయిన్ వేగంగా పోతోంది. నిద్రలాంటిది రావడంతో బెర్తుమీది కెళ్ళిపడుకున్నాను. ఎప్పుడు తెల్లారిందో కాని ట్రెయిన్ విజయవాడ దాటింది. బెర్తుదిగి సీట్లో కూర్చున్నాను. ఏలూరు స్టేషన్లో దేవకన్య కనిపించింది. నాతో ప్రయాణం చేస్తున్నట్లు తెలియకపోయినా, ఏలూరులో కనిపించినందుకు సంతోషించాను. మళ్ళీ ట్రెయిన్ దిగాను. స్టేషన్‌లో హడావుడిగా తిరుగుతూ

మావయ్యా కనిపించాడు. దగ్గరకు వెళ్ళి ఆ హడావుడికి కారణం ఐనా అడక్కుండా, నేను యెక్కడికి వెళ్ళిందీ చెప్పాను. మావయ్యకి తెలుసేమోనని దేవకన్యని చూపించి, యెవరని అడిగాను. మావయ్య గట్టిగా నవ్వాడు. నాకేం తెలుసంటాడేమోనను కున్నాను. అలా అనలేదు. నా మొహంలోకి చూసి "ఇక్కడే రామచంద్రరావు పేటలో నాకు తెలిసిన గోపాలరావు గారమ్మాయి. పేరు వీణ" అన్నాడు. పెళ్ళిచేసుకుంటా నన్నాను. మావయ్య సంబరపడ్డాడు. గార్డు విజిల్ వేశాడు. కంగారుగా "పిల్లను చూసు కున్నావుగా! ఈ సంబంధం ఖాయపరుస్తాను" అన్న మావయ్య మాటకు "అలాగే" అని సమాధానంచెప్పి ట్రెయిన్ ఎక్కాను. మాలినీ దేవిని చేసుకోపోయినా, మావయ్య నాపై చూపుతున్న యీ అపారమైన ప్రేమకు, సహృదయతకి, మనసులోనే జోహారు లర్పించాను.

పెళ్ళయిన తర్వాత, అమ్మ నా చేతులు పట్టుకుని బావురుమని యేడ్చింది. ఏమిటనడిగాను. గట్టిగా నిట్టూర్చి "ఇంకేముంది. అయిపోయింది. పెళ్ళైపోయింది. వీణ మూగది. అసలు విషయం తెలిసి కూడా మావయ్య మనతో చెప్పలేదు. కథలు కాకర కాయలు అనుకుంటున్నావా! ఇది కథకాదు. మాలినీదేవిని చేసుకోలేదని మావయ్య నీపై తీర్చుకున్న ప్రతీకారం నే నిప్పుడే చెప్పాను. గుడివాడ తాసిల్దారుగారమ్మాయి యుంటే, ఏలూరులో వీణుందన్నావు...."

అమ్మ చెబుతూనే వుంది. మావయ్యని నిందించకుండా, అమ్మను ఓదార్చడం నా వంతయింది.

## మద్దెతరగతోడు

కొడుక్కి పెద్దోట్లు సెప్పించాడు
మార్కుల్లో దాతే పూదూరు తిరిగి
పట్టు గలాసులో నెగ్గెట్టు
గెంటు కొచ్చిసినాడు
ఆడి కాళ్లు యీడి కాళ్లట్టుకోని
సివరికి యెలాగో వోనాగ
దాకటేరును సేనేసినాడు
ఉజాబు వుంకోవూల్లో మహా మెట్టి
నాలుగు సేతుల్తో సంపాదిత్తావుంటే
వారే సినాసెలం....
యెందు కొచ్చిన కొడుకుల్లా
అబ్బని అమ్మని సూడకపోతే పోసి
కంటికీ నలుసైపోతే యెల్లారా....
నువ్వనలియం.
కల్లార కొడుకును సూసుకుంటు
సిండుగా వున్నావన్నాడు
మద్దెతరగతోడు
మెల్లిగా సినాసెలం
నిండుగానే వున్నాను బాబూ...
అబ్బనీ అమ్మని సూడకపోయినా
తమరి బుల్లోడు సల్లగానే వున్నాడు
మా గుంటడు రేత్రి పొగలూ రిక్షా
తొక్కి తొక్కి
పేగులు తెగేసే దగ్గు సంపేత్తావుంటే
అమ్మేవు అన్నేవు సూపులు గుచ్చిసి
సూత్తానే సలబడిపోతున్నాడు బాబూ.
సూత్తానే సలబడిపోతున్నాడు అన్నాడు

—రంధి సోమరాజు